ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## తృతీయాధ్యాయము

**ఆదిశేషుడు ధర్మనందుసునకు సృష్టిక్రమమును మరియు వర్ణోత్పత్తిని గూర్చి తెలియజేయుట :-**

ధర్మనందనునకు ఆదిపరాశక్తియొక్క తత్త్వమును గూర్చి తెలియజేసిన ఆదిశేషభగవానుడు వానికి మరల ఈ విధముగా చెప్పసాగెను. "ఓ ధర్మనందనా! పరాశక్తియొక్క సత్యతత్త్వమును విని ధన్యుడవైతివి. ఇపుడిక సృష్టి క్రమమును గూర్చి చెప్పుచున్నాను. సావధాన చిత్తుడవై వినుము. నాయనా! సృష్టి కన్న మొదట ఆత్మ స్వరూపిణియగు దేవియే వుండెను. ఆ ఆత్మకన్న వేరైన దేదియును లేకుండెను. ఆ ఆత్మరూపమే పరమాత్మ. అదే చిత్ అనియు, సంవిత అనియు, పరబ్రహ్మమనియు పలువిధ నామములతో పలుకబడినది. ఆ ఆత్మ, మాటలకు, మనస్సునకు అందునదికాదు. కేవలము శృతి ప్రామాణ్యము చేతనే తెలియదగినది. దానితో సరిపోల్చదగిన రెండవ వస్తువు జగమున లేదు. ఆత్మ యుండుట, పుట్టుట, పెరుగుట, పరిణమించుట, క్షయించుట, నశించుట అను షడ్వికారములు లేనిది. దానినే సమస్త వేద శాస్త్రములు అవ్యాకృతమనియు, అవ్యక్తమనియు, సమస్తకారణములకు కారణమనియు ఆదితత్త్వమనియు సచ్చిదానంద రూపమనియు తెలియజేసినవి. అది పరాశక్తి యొక్క నిర్గుణరూపమని తెలియనగును. శుద్ధ చైతన్యమైన ఆ దేవి మాయ యొక్కకూడిక వలన

సృష్టికి నిమిత్త కారణ మగుచున్నది. ఇట్లు మాయా సహితయగు పరాశక్తి సగుణరూపిణియై విరాజిల్లునని తెలియనగును.

సమస్త ప్రాణుల కర్మలన్నియు బీజభూతములై యెచ్చటనుండునో, ఇచ్ఛా జ్ఞానక్రియలకాధారమేదియగునో ఆ సర్వసాక్షియైన ఆది తత్త్వమగు (సగుణ పరాశక్తినుండి) శబ్ద గుణకమగు ఆకాశముదయించెను. ఆ ఆకాశము నుండి స్పర్శ గుణకమగు వాయువు జనించెను. ఆ వాయువు నుండి రూపగుణాత్మకమైన తేజస్సు (అగ్ని) ప్రభవించెను. ఆ తేజస్సు నుండి రసగుణకమైన జలముదయించెను. అనంతరము ఆ జలము నుండి గంధగుణాత్మకమైన పృథ్వి జనించెను. శబ్ద స్పర్శ రూపరస గంధములను సూక్ష్మభూతములు పంచతన్మాత్రలని పిలువబడును. ఆ సూక్ష్మ పంచభూతములైన పంచతన్మాత్రల నుండి ఏర్పడిన ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి అను స్థూల పంచభూతముల కార్యముగ ఈ అనంత విశ్వము రూపొందినది. అనంతమైన ఈ విరాట్ విశ్వమే పరబ్రహ్మాశక్తియగు దేవికి స్థూలదేహమైనది. ఈ విరాట్ విశ్వరూపమునే విరాట్ బ్రహ్మమనియు, విరాట్ పురుషుడనియు, ఈశ్వరుడనియు వేదాంతులు పలుకుచున్నారు. ఈ విరాట్పురుషుని దేహమునందలి సర్వాంగముల నుండి జడచేతనమయములగు సమస్త జగములు ప్రభవించినవి. ఈ విశ్వరూపుని (విరాట్పురుషుని) మనస్సు నుండి చంద్రుడు, నేత్రముల నుండి సూర్యుడు, నాభి నుండి అంతరిక్షము, శిరము నుండి ఆకాశము, పాదముల నుండి భూమి కర్ణముల నుండి దిక్కులు కలిగినవనియు భూతరాశితో కూడిన ఈ విశ్వమంతయు దేవీస్థూల దేహరూపుడైన విరాట్ పురుషునితో ఒక పాదమై యున్నదనియు మిగిలిన మూడు పాదముల భాగము అమృత స్వరూపమైన స్వయంజ్యోతియై వెల్గొందు చున్నదనియు వేదములు అభివర్ణించినవి. ఈ జగముల సృష్టిస్థితిలయములు అనుకార్యములను నిర్వర్తించుటకై చతుర్ముఖ బ్రహ్మ, మహావిష్ణువు, ఈశ్వరుడు అను త్రిమూర్తులను పరాశక్తి ప్రభవింపజేసినది.

ఆ చతుర్ముఖ బ్రహ్మ యొక్క మనస్సు వల్ల అపరార్కుడును, ప్రాణవాయువు నుండి ప్రజాపతి, అపానము నుండి క్రతువు, వ్యానవాయువు నుండి పులహుడు, ఉదాన వాయువు నుండి పులస్త్యుడు, సమాన వాయువు నుండి వశిష్ఠుడు ప్రభవించిరి. ఆ బ్రహ్మ యొక్క ఎడమ భాగం నుండి స్త్రీలు, కుడిభాగం నుండి పురుషులు ఉద్భవించిరి. వారందరును బ్రహ్మాయాజ్ఞచే కర్మభూమియగు భూలోకమునకు చేరిరి. లోకపితామహుడైన ఆ బ్రహ్మసకల ప్రాణులకు వారి వారికి యోగ్యములైన కార్యములను వారి వారికి ఉచితములైన జీవనాధారములను, నియమములను నానా విధములైన దేహములను కల్పించెను.

అనంతరము బ్రహ్మ తన అవయవభేదముల వలన జన్మించిన మానవోత్తములైన ఋషులకు ఋగ్యజుస్సామధర్వణములను నాలుగు వేదములను ప్రసాదించెను. ప్రళయ పూర్వ జన్మల సంస్కార బలముచే మననశీలురైన ఆ మహర్షులు మానవ సమాజమునకు ప్రథమావసరములైన ఆహార పదార్థములను ఉదాత్త విధానంలో పొందుటకు అనువైన వ్యవసాయము, పశుపాలనము, వస్తు మార్పిడి రూపమగు వాణిజ్యములను వైదిక కర్మలను కనుగొని ఋగ్వేదము ద్వారా నాటి సమాజమునకు పిలువబడిరి. తదుపరి ఆ గణములవారే వైశ్య వర్ణము వారుగా రూపొందిరి. అనంతరము దేశమును ప్రజలను సమాజమును క్షతి నుండి కాపాడుచూ పాలించుటకవసరమగు రాజ ప్రజాధర్మకర్మోపాయములను మహర్షులు దర్శించి యజుర్వేదాదుల ద్వారా సమాజానికి బోధించిరి. ఆ వైదిక కర్మల యందు ప్రవేశించిన వారు రాజన్య గణములుగా పిలువబడి తదనంతరము క్షత్రియ వర్ణము వారుగా రూపొందిరి. సమృద్ధములైన సంపదలు, సమర్థమైన రక్షణ ఏర్పడిన పిదప ఆనందాన్వేషణ మొనర్చిన మహర్షులు సామవేదము ద్వారా సమాజమునకు బ్రహ్మానంద సహోదరానంద దాయకములైన కళలను బ్రహ్మానంద సాధకమగు జ్ఞానమును కనుగొని బోధించిరి. ఆ కర్మల యందు ప్రవేశించు యోగ్యత

గలవారు వేదాధ్యాపన యజనాది వృత్తులలో ప్రవేశించి విప్రగణముగా పిలువబడి తదుపరి బ్రాహ్మణ వర్ణము వారుగా రూపొందిరి. మేధస్సంపద లేనివారు పై మూడు వర్ణముల వారికి సేవాసహకారములను అందించుచు మహాశూద్రులు, అను వర్ణము వారుగా రూపొందిరి. ఇట్లు తొలివేదమైన ఋగ్వేదము వలన వైశ్యవర్ణము, రెండవ వేదము యజుర్వేదము వలన క్షత్రియ వర్ణము, మూడవ వేదమగు సామవేదము వలన బ్రాహ్మణవర్ణము, నాల్గవదైన అధర్వణవేదము వలన శూద్రవర్ణము యేర్పడినవి. అందులకేశృతి.

**"ఋగ్భ్యేజాతం వైశ్యర్ణమాహుః**
**యజుర్వేదం క్షత్రియ స్యాహుర్యోనిం ।**
**సామవేదో బ్రహ్మణానాం ప్రసూతిః**
**పూర్వే పూర్వే భ్యోవచ ఏతదూచః ॥"** అని తెలియజేసినది.

ఇట్లు వేదములు తెలిసిన కర్మలయందు ప్రవేశించినవారై విరాట్ విశ్వ మానవ సంఘస్వరూప బ్రహ్మమునకు బ్రాహ్మణులు ముఖముగను, క్షత్రియులు బాహువులుగను, వైశ్యులు ఊరువులుగను, శూద్రులు పాదములుగనునైరి. ఈ విషయమే ఋగ్యజుర్వేదములయందు

**"బ్రాహ్మణోశ్చ ముఖమాసీత్ బాహురాజన్యకృతః ।**
**ఊరుతదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ంశూద్రో ఆజాయత ॥"**

అని అలంకారికముగ చెప్పబడినది.

బ్రహ్మ అంగిరసుని దేవ బ్రాహ్మణ ఋషులకు సకల కర్మల విషయమై నియమకుడుగను, వశిష్ఠుని క్షత్రియులకు నియమకుడుగను, అపరార్కుని వైశ్యులకు శిక్షకుడుగను నియమించెను. భూతలములో అంగిరస మహర్షి బ్రాహ్మణులకు

వేదవిహితకర్మలగు శ్రౌతస్మార్తాది క్రియలను, బహువిధములైన యజ్ఞములను చక్కగ తెలియజేసెను. వశిష్ఠ మహర్షి రాజప్రజాధర్మములను, ప్రజా పరిపాలన పద్ధతులను, రక్షణ విధానములను క్షత్రియులకు సముచితముగ బోధించెను. ధర్మాధర్మవిచక్షణను, యజ్ఞాచరణమును, ద్విజానుసరణమును, సత్యవ్రతాదులను వైశ్యులకు బోధించెను. వారందరు తమ గురువులుపదేశించిన విధానములనుసరించి, విద్యుక్త కర్మల నాచరించుచు ప్రసిద్ధులైరి. శూద్రులు సమాజమునకు అధికమైన శుశ్రూషగావించుచు 'కాండపుష్ఠులని' చెప్పబడుచు ప్రతిష్ఠనందిరి.

బ్రహ్మ పుత్రులైన అంగిరసు, వశిష్ఠుడు, అపరార్కుడు మొదలైన ఏడుగురు మహర్షులు చాతుర్వర్ణ్యముల వారికి గోత్ర ప్రవరలను విధి ప్రకారముగ నిర్మించి గృహ్యాసూత్రోక్త విధానములతో, ఉపనయనాది సంస్కారములు చేయించి, వారి చేత షడంగములతో కూడిన మరియు లక్షణయుక్తములైన వేదముల నధ్యయనము చేయించిరి. వారివారి గుణకర్మ స్వభావముల ననుసరించి, గోత్రప్రవరాది భేధములనెంచి స్త్రీ పురుషులకు వివాహ క్రతువులు చేయించిరి.

వైశ్య వర్ణమునకు నియామకుడైన అపరార్క మహర్షి వైశ్యులను జూచి "శిష్యులారా! మీరలింతటి నుండి ఋషులను, పితరులను, దేవతలను సంతృప్తులను జేయుచు ఋషి పితృ-దేవ ఋణములను దీర్చి ఋణత్రయ విముక్తులుకండు, పరిశుద్ధులై గోరక్షణము, సత్యనీతి సంయుతమైన వ్యాపారము, న్యాయబద్ధమైన కుసీదము, సముచితమైన కృషి, నవరత్నముల క్రయ విక్రయ వాణిజ్యము మొదలైన లౌకికకర్మలను దాన, యమజనాధ్యనాది పారలౌకిక కర్మలను ఆచరించుచు, ధర్మకార్యములకు మినహాయింపగ మిగిలిన సంపాదనతో జీవించుచు, ఆదర్శ ప్రాయుములైన వర్ణాశ్రమ విధానముల ననుసరించి లోక కళ్యాణకారులుకండు" అని బోధించిరి.



బ్రహ్మదేవుడు వైశ్యులకు, కృషి, వాణిజ్య, పశుపాలన, వైశ్యధర్మములని బోధించుట

## వైశ్యులకు బ్రహ్మచే శ్రేష్ఠులను బిరుద ప్రదానము :-

ఆ కాలపు స్వభావ ప్రభావముల వలన సమస్త జనులు సమస్త లోకములలో సంచరించు చుండెడివారు. నాడు సకల జనులు సత్యసంధులు, దీర్ఘాయుష్కులు, అత్యంత శక్తి సంపన్నులు. వారు బ్రహ్మదేవుని యానతిమేరకు సృష్టి యొక్క అభివృద్ధికై పాటుపడసాగిరి.

ఇట్లుండగ ఒకసారి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు బ్రహ్మ దర్శనమునకై సత్యలోకమునకు వెళ్ళిరి. ఆ సమయమున లోకేశ్వరుడైన బ్రహ్మ వారి వారి గోత్రాభివృద్ధినీ, జనసంఖ్యాభివృద్ధినీ తెలియజేయుడని ఆదేశించెను. అపుడు దూర్వాసుడను మహర్షి "ఓ పితామహా! మా బ్రాహ్మణులందిపుడు నూటతొమ్మిది గోత్రములను, ప్రసిద్ధములైన

పదునెనిమిది గణములుగనున్నవని" చెప్పెను. క్షత్రియ నాయకుడైన ధనుంజయుడను రాజులేచి "ఓ విధాతా! మాకు ఏడుగోత్రములును ఒక్క గణము ఏర్పడినవి అని తెలియజేసెను. పిమ్మట వైశ్యనాయకుడైన సోమదుడు నిలచి "బ్రహ్మదేవా! మేము 714 గోత్రముల వారము. 102 గణములవారము గనునైతిమి" అని విన్నవించెను. అపుడా బ్రహ్మవైశ్యులగోత్రాధిక్యమునకు సంతోషించి బిడ్డలారా! మీరు ప్రజాసృష్టిని అభివృద్ధి పరచుటలో శ్రేష్ఠత్వమును సాధించితిరి. గనుక ఇకముందు శ్రేష్ఠులను పేరు పొందగలరని పలికి వైశ్యులనాశీర్వదించెను. అంత సర్వజనులును బ్రహ్మదేవుని పూజించి భూలోకమునకు వెడలిపోయిరి. అందరును సమస్త సుఖసంపదలతో శాంతితో సుఖసంపదలతో శాంతితో జీవింపసాగిరి." అని కరుణాంతరంగుడైన ఆదిశేషుడు, ధర్మనందనునకు యుగకాలాదుల జ్ఞానమును, పరతత్త్వజ్ఞానమును, పరాశక్తి సంకల్పానుసారము బ్రహ్మవలన గలిగిన సమస్త సృష్టిక్రమమును, వర్ణవ్యవస్థను సంక్షిప్తముగ తెలియజేసెను. అద్భుత విషయమును విన్న ధర్మనందనుడు ఆనందపరవశుడై ఆదిశేషునితో "ఓ దయానిధీ! దేవదేవా! నీ కృపవలన సనాతనము, మహత్తరము నైన జ్ఞానమును పొందగలిగితిని. సృష్టి రహస్యమంతయు నీచేత చెప్పబడినది. హే కృపాళో! నాకిప్పుడు ప్రళయముల యొక్క జ్ఞానమును ప్రసాదింపుము." అని ప్రార్థించెను. ఆదిశేషుడు సంతోషించి యీ విధముగ చెప్పసాగెను.

## ప్రళయములు – వాని వివరములు :-

"ఓ ధర్మనందనా! నీవడిగిన విషయమును సంక్షిప్తముగ తెలుపుచున్నాను. శ్రద్ధతో ఆలకింపుము. ప్రళయములు నాలుగు విధములు. ప్రతియుగము నందును ప్రకృతి వైపరీత్యముల వలన జరుగు జలప్లావన భూకంపాదులు, అతి తీవ్రములైన గాలివానలు, యుద్ధములు మొదలగు వానివలన అక్కడక్కడ కలుగు మహోపద్రవములు అవాంతర ప్రళయములని చెప్పబడుచున్నవి.

ప్రతి యుగము యొక్క అంతమున ప్రళయము జరిగి, అధిక సంఖ్యలో ప్రాణనష్టము కలుగును. అట్టి ప్రళయములు యుగప్రళయములనబడుచున్నవి.

ఒక మనువుకాలము ముగిసి, మరియొక మనువుకాలము ప్రారంభమగుటకు మధ్య సమయమున జరుగ మహాప్రళయమును మన్వంతర ప్రళయమందురు. మన్వంతర ప్రళయములలో జీవుల ప్రాకృత శరీరము లన్నియు నశించి, బీజములు మాత్రమే మిగులును. మరియొక మనువు కాలమురాగానే బీజవృద్ధి జరిగి సృష్టి వికాసమేర్పడును. మన్వంతరము మారినపుడు సృష్టియొక్క నైమిత్తిక గుణములలో కూడ కొంత మార్పు కలుగును.

చివరగ జరుగునది కల్పప్రళయము. ఇందు బ్రహ్మాండములోని భువనములు, పంచభూతములు ప్రకృతిలో లీనమైపోవును. పరాశక్తియొక్క కార్యరూపమైన ప్రకృతి యొక్క స్థూలరూపము అంతరించి కారణరూపమును పొందును. తిరిగి మరోకల్పము ప్రారంభమగునపుడు యధాపూర్వము క్రమపరిణామమున సృష్టి జరుగును. ప్రస్తుత కల్పములో సృష్టి జరిగిన తరువాత స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుసములను ఆరు మన్వంతరములు గడిచిపోయినవి. ప్రస్తుతము జరుగుచున్నది వైవస్వతమనువుకాలము. దీని తరువత ఇంకను ఏడు మన్వంతరములు జరుగువలసి యున్నవి. ఈ పధ్నాలుగు మన్వంతరముల కాలము కలిసి బ్రహ్మాకల్పమనబడును. పధ్నాల్గవ మన్వంతరము యొక్కఅంతములో జరుగు ప్రళయమే కల్ప ప్రళయము.

మరొక ముఖ్య విషయము వినుము. ఇపుడు గతించిన మన్వంతర ప్రళయము జలప్రళయము. ఇదే ప్రళయములకు సంబంధించిన సంక్షిప్త వివరణము. నీవు సర్గ (సృష్టి) ప్రతిసర్గ (ప్రళయము) ల విషయములను విని ధన్యుడవైనావు" అని ఆదిశేషుడు ధర్మనందనునకు ప్రళయములను గూర్చిన జ్ఞానమును ప్రసాదించెను.

ఇక్కడ ఇట్లుండగ అట చ్యవన మహర్షి ఆశ్రమములో అందరూ చింతాకులస్వాంతులై వున్నారు. పుష్ప సమిధాదులకై అడవికిపోయిన ధర్మనందనుడు ఆశ్రమమునకు తిరిగి రాకపోవుట వలన చ్యవనుడు శిష్యగణముతో అరణ్యమంతటను గాలించెను. ఫలితము దక్కలేదు. ధర్మనందనుడి సహాధ్యాయులు నిద్రాహారములు మాని ధర్మనందనుని వంటి ఉత్తమ మిత్రుడు లేని తమ జీవితములెందుకని విరక్తులై దుఃఖించసాగిరి. అటుపై భార్గవచ్యవనుని వలన యీ వృత్తాంతమును తెలుసుకొన్న ధర్మశ్రేష్ఠి దంపతులు గోడుగోడున ఏడ్చుచు చ్యవనాశ్రమమునకు చేరుకొనిరి. చ్యవన మహర్షి వారిని ఓదార్చి "తప్పిపోయిన పుత్రుని తిరిగి ప్రసాదించుమని ప్రార్థించుచు అపూర్వమైన కన్యకా వ్రతమును ఆచరింపుడ"ని ఉపదేశించెను. పరాశక్తియైన ఆది కన్యక యొక్క మహావ్రత దీక్షను పొందిన ధర్మనందనుని తల్లిదండ్రులు శాస్త్రోక్తవిధిని ఏకాగ్రచిత్తులై వ్రతమాచరింపసాగిరి. వ్రతసమాప్తికి సమయము ఆసన్నమైనది.

అక్కడ రసాతలములో ధర్మనందనునకు సమస్త జ్ఞానమును ప్రసాదించిన ఆదిశేషుడు, చ్యవనాశ్రమములోని పరిస్థితిని దివ్యదృష్టితో తిలకించి, ధర్మనందనునితో "కుమారా! నిన్నుగానక మిక్కిలి శోకించుచున్న తల్లిదండ్రులు నీగురువుగారి ఉపదేశానుసారము ఆదికన్యకాదేవీ మహావ్రతమును ఆచరించు చున్నారు. నీవు శీఘ్రముగ నీజననీజనకుల యొద్దకు జేరి, వారికి మనశ్శాంతి కలిగించవలసి యున్నది." అని పలికి లోకధారకుడైన ఆ యనంతుడు తన సంకల్ప ప్రభావముతో ఆ మరుక్షణమే ధర్మనందనుడు తల్లిదండ్రులయొద్ద వుండునట్లుగావించెను.

వ్రత సమాప్తి సమయమునకు ఆకస్మికమగ అరుదెంచిన పుత్రుని జూచి అతని తల్లిదండ్రులను, ప్రియశిష్యునిగాంచిన చ్యవన మహర్షియు, ఆశ్రమ వాసులు ఆశ్చర్యానందములలో మునిగితేలిరి. చూడామణిదంపతులు వ్రతసమాప్తి గావించి, దేవీచరణములకు ప్రణమిల్లి "ఓ పరాంబికా! ఓ ఆదికన్యకాపరమేశ్వరీ! నీ వ్రతాచరణ

ప్రభావములతో మేము మా పుత్రుని మరల పొందగలిగితిమి. నీ మహిమ అపారము. నీలీలలనంతములు. ఎల్లవేళల మా హృదయములలో నీయందు అచంచలమైన భక్తి నిలచియుండునట్లు అనుగ్రహింపుము." అని ప్రార్థించిరి.

అటుపై ధర్మనందనుని వలన జరిగిన ఉదంతమంతటిని సవిస్తరముగ విని గురవగు చ్యవనమహర్షి హర్షపులకాంచితగాత్రుడై "నాయనా! ధర్మనందనా! నీ త్యాగగరిమ అనితరసాధ్యము. సాక్షాత్తుగ ఆదిశేష భగవానుని నుండి సమస్త జ్ఞాన రహస్యములను గ్రహించిన నీవంటి భాగ్యశాలిని పుత్రునిగ బడసిన నీ తల్లిదండ్రులు ధన్యులు. నిన్ను శిష్యునిగ పొందిన నేనునుయెంతయో అదృష్టవంతుడను. నీ పుట్టుకచే వైశ్యవంశమే పునీతమైనది. జ్ఞానపుంజమువై వెలుగొందుచున్న నీకిక బోధింపదగిన దేమియును లేదు." అని పలికి వానికి సమావర్తన సంస్కారము జరిపెను. చూడామణి దంపతులా మహర్షికి కోరిన గురుదక్షిణాదులను సమర్పించి తనయుని తోడ్కొని తమ నగరమునకు తరలిపోయిరి.

"ఆ ధర్మనందనుడు ఆదిశేషుని కృపా విశేషముతో ప్రాప్తించిన అద్భుత జ్ఞాన సంపదను యెల్లరుకు పంచిపెట్టుచు జీవితకాలమున సమస్త భోగ భాగ్యములననుభవించి మిక్కిలి ప్రఖ్యాతి వహించెను." అని పౌరాణికోత్తముడైన సూతుడు శౌనకాది మహర్షులకు వినిపించిన ధర్మనందనుని పవిత్ర చరిత్రను సాలంకాయనుడు మణిగుప్తాది వైశ్యోత్తములకు సవివరముగ తెలియజేసెను.